క్లుప్తంగా

డీఈఓకు సన్మానం


వెంకటేశ్వరచారిని సన్మానిస్తున్న దృశ్యం

సింగరేణి(కొత్తగూడెం): జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరాచారిని, ఉమ్మడి జిల్లా పరీక్షల విభాగం అధికారి ఎస్.మాధవ రావులను శుక్రవారం ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ తన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. సింగరేణి విద్యాసంస్థలోని విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి తమ వంతు సహాయం ఉంటుందన్నారు. జిల్లాలోని పాఠశాలల విషయంలో ప్రభుత్వం ఏవిధంగా నిర్ణయాలు తీసుకుంటుందో అదేవిధంగా సింగరేణి విద్యాసంస్థలకు తమ సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సునిల్‌కుమార్, హెచ్‌ఎం ఏ.సాయిసుజాత, డి.పూల్‌సింగ్, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారమే స్కూళ్లు నడపాలి

సింగరేణి(కొత్తగూడెం): ప్రభుత్వం సంక్రాంతి పండుగ సందర్భంగా పాఠశాలలకు సెలవులు ప్రకటిస్తే, ప్రభుత్వ పాఠశాలల్లో పాటిస్తున్నారు. కానీ ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ ఉత్తర్వులను పట్టించుకోకుండా యథావిధిగా నడిపిస్తున్నారని, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారమే పాఠశాలలు నడిపించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కాంపాటి పృథ్వీ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సెలవుల సమయంలో మహిళా టీచర్లను స్కూల్‌కు హాజరు కావాలని లేదంటే జీతాల్లో కోత విధిస్తామంటున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంలో జిల్లా విద్యాశాఖాధికారులు జోక్యం చేసుకోవాలని కోరారు.

సర్వే త్వరగా పూర్తి చేయాలి


మాట్లాడుతున్న శంకర్

ఇల్లెందురూరల్: ఇందిరమ్మ ఇంటింటి సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని గృహనిర్మాణ శాఖ పీడీ శంకర్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్వే వివరాలను ఎంపీడీఓ ధన్‌సింగ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ సర్వే వల్ల కొంత జాప్యం జరిగిందని, ఒకటి, రెండు రోజుల్లో సర్వే పూర్తి చేసేలా పంచాయతీ కార్యదర్శులు పనిచేస్తున్నారని ఎంపీడీఓ వివరించారు. అందుబాటులో లేని దరఖాస్తుదారుల వివరాలను స్థానికంగా ఉండటం లేదన్న రిమార్క్‌తో జాబితాలో పొందుపరుస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ ఏఈ డేవిడ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణపై ఫిర్యాదు

పాల్వంచ: పాల్వంచ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 1 నుంచి 136 వరకు, సర్వే నంబర్ 1 నుంచి 999 వరకు సంస్థాన్ పరిధిలోని ప్రభుత్వ భూములను స్థానికంగా పలువురు ఆక్రమించి అక్రమంగా పట్టా పాసు పుస్తకాలు పొంది రైతు బంధు పథకం పొందుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫ్యాక్స్ ద్వారా వినతిపత్రం అందించినట్లు వెంగళరావు కాలనీకి చెందిన స్థానికులు ఆరుద్ర సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ భూములను అసైన్‌మెంట్ ద్వారా పొందిన వ్యక్తుల వివరాలను ప్రతీ మండల ఆఫీసులలో నోటీసు బోర్డులో ఉంచాలని కోరామని పేర్కొన్నారు. అదేవిధంగా రెవెన్యూ శాఖ మంత్రికి వినతిపత్రాన్ని ఫ్యాక్స్ ద్వారా అందించినట్లు పేర్కొన్నారు.

ఎస్ఎఫ్ఐ సభలను విజయవంతం చేయండి..


మాట్లాడుతున్న రామ్‌చరణ్

పాల్వంచ: ఫిబ్రవరి 5,6 తేదీల్లో పాల్వంచ పట్టణంలో జరగనున్న ఎస్ఎఫ్ఐ జిల్లా 4వ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కమిటీ సభ్యుడు రామ్‌చరణ్ అన్నారు. శుక్రవారం పాల్వంచలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ భవిష్యత్ కార్యాచరణను ఈ మహాసభల్లో రూపొందించనున్నట్లు చెప్పారు. దేశ సమైఖ్యత, సమగ్రత, విద్యారంగ కాషాయీకరణ, వ్యాపారీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో అనిల్, జానకిరామ్, లక్ష్మీనారాయణ, కార్తీక్, సురేష్, సుమంత్, వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

వైష్ణవాలయాలు కిటకిట

ఘనంగా ముక్కోటి ఏకాదశి • ఉత్తర ద్వార దర్శనంతో పులకించిన భక్తులు • భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

ఇల్లెందురూరల్: ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండలంలోని పలు ఆలయాలు శుక్రవారం కిటకిటలాడాయి. కొమరారం శ్రీకోదండ రామాలయం, సుభాష్‌నగర్ రామాలయం, మొండితోగు శివాలయంలలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల్లో స్వామివారిని ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకొని తరించారు.

జూలూరుపాడు: మండల ప్రజలు ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జూలూరుపాడు, పడమటనర్సాపురం, సూరారం, మాచినేనిపేటతండా గ్రామాల్లోని శ్రీసీతారామాలయాల్లో, కాకర్ల శ్రీసంతాన వేణుగోపాలస్వామి, గుండెపుడి, వెంగన్నపాలెం, పాపకొల్లు, అనంతారం శ్రీఅభయాంజనేయస్వామి ఆలయాల్లో, వెంగన్నపాలెం శ్రీషిర్డీ సాయిబాబా ఆలయాల్లో శుక్రవారం తెల్లవారుజాము నుంచి అష్టోత్తర పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఉత్తర ద్వార దర్శనం చేసి స్వామి వారిని దర్శించుకున్నారు.


పాల్వంచ: శాస్త్రి రోడ్డులోని రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పాల్వంచ: వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం పాల్వంచలోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాత పాల్వంచ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం, బొల్లేరుగూడెం రామాలయంలో పూజారులు కందాల సింహాద్రి, ఆనంద కుమారాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు, కొత్వాల సత్యనారాయణ, రమణమూర్తి, సుజాత, నాసరయ్య, గాంధీ, చంద్రశేఖర్, కేశబోయిన కోటేశ్వరరావు, అంజయ్య, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


ఇల్లెందురూరల్: రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


జూలూరుపాడు శ్రీసీతారామాలయంలో ఉత్తర ద్వార దర్శనం..


కాకర్ల శ్రీసంతాన వేణుగోపాలస్వామిలో..

ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయొద్దు..

ఇల్లెందు: ప్రజలు ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చేయవద్దని ఐఎంసీ బ్రాండ్ అంబాసిడర్, కోచ్ ప్రముఖ ఆయుర్వేద వైద్యులు చెన్న గోపి అన్నారు. శుక్రవారం ఇల్లెందులో జరిగిన ఆయుర్వేదంపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆయుర్వేదంలో ఆరోగ్య సమస్యలకు పరిష్కార మార్గం సులభంగా ఉంటుందని, మారుతున్న కాలానికి అనుగుణంగా కల్తీ వస్తువుల వినియోగం పెరిగిపోయినందున అనేక సమస్యలు వస్తున్నట్లు చెప్పారు. వాటికి సులభంగా పరిష్కారం ఆయుర్వేదం ద్వారా ఉంటుందన్నారు. ఇంటి అవసరాల కోసం ప్రజలు మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్న వస్తువులు చాలా రకాలుగా కల్తీ జరుగుతున్నాయన్నారు. దీనివల్ల ముఖ్యంగా షుగర్, బీపీ, థైరాయిడ్, పైల్స్, సోరియాసిస్, గ్యాస్ ట్రబుల్, గుండె, లివర్, కిడ్నీ, మోకాళ్ల నొప్పులకు వందశాతం ఆయుర్వేదంతో పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎంసీ ప్రతినిధులు స్వర్గం కోటేశ్వరరావు, సత్యనారాయణ, శ్రీరంగం జయంత్, అయ్యప్ప, గుర్రం రాజేష్, రవి, డానియేల్, రాజశేఖర్, ప్రసాద్, ఎం.మధు, చాంద్, కృష్ణ, కిరణ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైద్యులు చెన్న గోపి

పోలీసు స్టేషన్లలో క్యూఆర్ కోడ్


పాల్వంచరూరల్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్


జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను అంటిస్తున్న ఎస్సై రవి

పాల్వంచరూరల్: పోలీసుల పనితీరు, పోలీసులపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలను తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వ పోలీసు శాఖ రూపొందించిన క్యూఆర్ కోడ్ ఆఫ్ సిటిజన్ పోస్టర్లను జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ ఆదేశాల మేరకు శుక్రవారం కిన్నెరసానిలోని రూరల్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేశారు. ఎవరైనా బాధితులు తమ సమస్యలను చెప్పుకునేందుకు పోలీసుస్టేషన్‌కు వెళితే పోలీసు సిబ్బంది వ్యవహరించిన తీరు, ఫిర్యాదులు, పాస్‌పోర్టు వెరిఫికేషన్ ఈ-చలానా, ఎఫ్ఐఆర్ తదితర సేవలపై సెల్‌ఫోన్‌లో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాలు తెలియజేసే అవకాశం పోలీసుశాఖ కల్పించింది.

జూలూరుపాడు: క్యూఆర్ కోడ్ విధానంతో ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందని జూలూరుపాడు ఎస్సై బాదావత్ రవి అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో పోలీసుశాఖ అమలు చేస్తున్న క్యూఆర్ కోడ్ విధానంతో ఫిర్యాదుదారులు, ప్రజలు తమ అభిప్రాయాలను తెలియపరచవచ్చన్నారు. అనంతరం ఎస్సై రవి, పోలీస్ సిబ్బంది స్టేషన్‌లో క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను అంటించారు.

పర్యాటక అభివృద్ధే లక్ష్యంగా శ్రమదానం


శ్రమదానం చేస్తున్న పూబెల్లి గ్రామస్తులు

ఇల్లెందురూరల్: పూబెల్లి గ్రామాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసుకోవాలన్న సంకల్పంతో పంచాయతీ పరిధిలోని మూడు గ్రామాల ప్రజలు శుక్రవారం శ్రమదానంతో పనులు ప్రారంభించారు. పూబెల్లి రెండు గుంపులు, దండగుండాల గ్రామాల నుంచి ఇంటికొకరు చొప్పున కదిలారు. పర్యాటక కేంద్రంగా నిర్ణయించుకున్న చెరువు వద్దకు చేరుకొని పరిసరాలను శుభ్రం చేసే పనులకు శ్రీకారం చుట్టారు. కొడవళ్లు, గొడ్డళ్లతో కంపచెట్లను తొలగించారు. చెరువు గట్టును శుభ్రం చేశారు. పర్యాటకులు విడిది చేసే ప్రాంతాన్ని చదును చేశారు.

కార్యక్రమంలో కార్యదర్శి బాలకృష్ణ, గ్రామ పెద్దలు మూతి ముత్యాలు, రామస్వామి, బక్కయ్య, ఈసం భాస్కర్, వెంకటనర్సు, జోగ శ్రీకాంత్, చీమల ప్రసాద్, పొదుపు సంఘాల ప్రతినిధులు కృష్ణవేణి, బాయమ్మ, చీమల విజయ, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలి

పాల్వంచ: ఎస్సీ వర్గీకరణ అమలుపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో లక్ష డప్పులు – వేయి గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ జాతీయ కోర్ కమిటీ నాయకులు ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ఆందోళనతో రేవంత్‌రెడ్డి సర్కార్‌కు అల్టిమేటం జారీ చేయడం జరుగుతుందన్నారు. మందాకృష్ణ మాదిగ నాయత్వంలో ఎస్సీ వర్గీకరణ చేస్తే విజయోత్సవం చేస్తామని, లేదంటే చావు డప్పులు మోగిస్తామన్నారు. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు కొత్తపల్లి సోమయ్య, దేవంగి రమణయ్య, నల్లగట్ల వెంకన్న, ఇంసపల్లి కృష్ణ, రామ్మూర్తి, సమ్మక్క, సూర్యవాణి, సుహాసిని, రాంబాబు, శ్రీను, యాకయ్య, తిరుపతయ్య, మిరియాల వెంకటేశ్వర్లు, ఈశ్వరయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

నేడు విద్యుత్ సరఫరా బంద్

జూలూరుపాడు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జూలూరుపాడు విద్యుత్‌శాఖ ఏఈ సతీష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు ముగ్గుల పోటీలు

ఇల్లెందురూరల్: సంక్రాంతి సందర్భంగా ఇందిరానగర్‌లో వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయా సంఘాల నాయకులు వజ్జ సురేష్, సోమ సుజాత, జైబున్నీసా, కొడెం బోస్ తెలిపారు. ఈ మేరకు పంచాయతీ పరిధిలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ.. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

వైద్యశాఖలో ఖాళీల భర్తీ

కొత్తగూడెంరూరల్: జిల్లా వైద్యఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న ఫార్మసిస్ట్, ఏఎన్ఎం పోస్టులను భర్తీ చేసినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ నాయక్ తెలిపారు. మూడు ఫార్మసిస్ట్ పోస్టులకు మెరిట్ లిస్ట్ ఆధారంగా నిర్వహించిన ఇంటర్వ్యూకు ఇద్దరు హాజరు కాగా ఆ ఇద్దరూ ఎంపికైనట్లు తెలిపారు. మూడు ఏఎన్ఎం పోస్టులకు నిర్వహించిన ఇంటర్వ్యూలో ముగ్గురిని నియమిస్తూ శుక్రవారం నియామకపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.బాలాజీనాయక్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె.సుదర్శన్, డిప్యూటీ డెమో ఫైజ్‌మొహినుద్దీన్, రతన్‌రాజ్, దీపిక పాల్గొన్నారు.

బాలుడికి గాయాలు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రాపురంలో గాలిపటం ఎగురవేస్తుండగా పక్కనే ఉన్న విద్యుత్ తీగలు తగిలి వంశీ అనే బాలుడికి గాయాలయ్యాయి. తల్లిదండ్రులు వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

మేనిఫెస్టో అమలు చేయండి..

ఇల్లెందు: రాష్ట్ర ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు రూ.18 వేలు ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబీ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇల్లెందు పట్టణంలో ఆశా వర్కర్లు, సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. మాట్లాడుతూ.. ఏఎన్ఎం శిక్షణ పూర్తి చేసిన ఆశా కార్యకర్తలకు పదోన్నతి కల్పించాలని, వెయిటేజ్ మార్కులు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా 15 రోజుల సమ్మెకాలం వేతనం ఇవ్వాలని, బీమా సదుపాయం కల్పించాలని కోరారు. ప్రతీ ఆదివారంతో పాటు పండుగ సెలవులు ప్రకటించాలని టార్గెట్‌లు రద్దు చేయాలని కోరారు. రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వజ్జా సుశీల, తాళ్లూరి కృష్ణ, ఉమాదేవి, మల్లేశ్వరి, సుగుణ, చంద్రకళ, పార్వతి, కౌసల్య, అనసూర్య, కావేరి, లక్ష్మి, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలు

హామీలు మరిచిన కాంగ్రెస్ నాయకులు



నిరసన తెలుపుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా యూత్ డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన 5 హామీలను అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్డ్ వయస్సు పెంచాలనే ప్రతిపాదనను వెనక్కితీసుకోవాలి డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కొత్తగూడెం పట్టణంలోని లైబ్రరీ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడారు.

ప్రభుత్వం ప్రతీ సంవత్సరం రెండు లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తామని, జాబ్ క్యాలెండర్ ద్వారా నియామకాలను చేపడతామని నిరుద్యోగ భృతి రూ.4000 చెల్లిస్తామని, యూత్ కమిషన్ ఏర్పాటు చేస్తామని చెప్పి.. అధికారంలోకి వచ్చి సంవత్సరం అయినా వాటిని అమలు చేయలేదన్నారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఎదురు చూస్తున్నట్లు చెప్పారు.

క్రీడలతో మానసికోల్లాసం

కొత్తగూడెంఅర్బన్: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని కాంగ్రెస్ నాయకుడు జేబీ శౌరి అన్నారు. శుక్రవారం రాజేందర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రకాశం స్టేడియంలో ప్రారంభమైన గెట్ టూ గెదర్ లెజెండ్స్ క్రికెట్ పోటీలను పోటీలను టాస్ వేసి ప్రారంభించారు. మాట్లాడుతూ.. యువత క్రీడా పోటీలల్లో గెలుపుఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. ముందుగా టోర్నమెంట్ జెర్సీలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యర్రా కామేష్, వైద్యులు కవిత, మురళి, దేవర్ల లింగమూర్తి, ఘణచారి, సూర్యతేజ, ఘనపురం తివిక్రమ్, కనుకుంట్ల శ్రీను, దేవర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం..

టేకులపల్లి: టేకులపల్లి మండలం కొత్తతండా(జి) పంచాయతీ మంగ్యా తండాలో ఏర్పాటు చేసిన కల్లు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం టేకులపల్లి ఎస్ఐ పోగుల సురేష్, కాంగ్రెస్ నాయకుడు కోరం సురేందర్ ప్రారంభించారు. మాట్లాడుతూ.. యువత క్రీడల వైపు దృష్టి సారించాలని, సంక్రాంతి పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాలోత్ భాస్కర్, రాజ్కుమార్, రెడ్యానాయక్, బానోత్ రవి, బోస్, గణేష్, సుదీప్ పాల్గొన్నారు.


టేకులపల్లి: క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎస్ఐ సురేష్

‘హామీల అమలులో ప్రభుత్వం విఫలం’


చుంచుపల్లి: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


జూలూరుపాడు: ధర్నా చేస్తున్న నాయకులు

చుంచుపల్లి: జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్ మాట్లాడుతూ.. రూ.2 లక్షల వ్యవసాయ రుణమాఫీ సగంమంది రైతులకు మాత్రమే అయిందని, మిగిలిన రైతులు ఎదురు చూస్తున్న పరిస్థితి బాధాకరమన్నారు.

రైతులందరికీ ఎంత అప్పు ఉన్నా.. హామీ ప్రకారం మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కువ శాతం రైతులకు పహాణి మీదనే వ్యవసాయ రుణాలు తీసుకున్నారని, షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలన్నారు. రైతు భరోసా పేరుతో ఎకరాకు ఏడాదికి రూ.15 వేలు ఇవ్వడం లేదని విమర్శించారు. రైతులు పండించిన అన్ని పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి నేడు సన్నవడ్లకు మాత్రమే ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు భూక్యా వెంకటేశ్వర్లు, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మాదినేని సతీష్, జిల్లా నాయకుడు యడ్లపల్లి శ్రీనివాస్, గుగులోతు రమేష్, రాపాక రమేష్, సిరిపురపు ప్రసాద్ పాల్గొన్నారు.

తహసీల్ ఎదుట ధర్నా...

జూలూరుపాడు: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో రైతులు, ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయడంలో విఫలమైందన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సిరిపురపు ప్రసాద్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.సతీష్, తెల్లం నరసింహారావు, నున్నా రమేష్, పుల్లారావు, నాగ శ్రీను, వెంకట్రావు, గోపాల్‌రావు, వెంకటేశ్వర్లు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు


కొత్తగూడెంఅర్బన్: కూలీలైన్ ప్రభుత్వ పాఠశాలలో

భోగి మంటలు, రంగవల్లులతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఉపాధ్యాయులు భోగి పళ్లు పోసి విద్యార్థులను ఆశీర్వదించారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. గాలిపటాలు ఎగురవేశారు. సంస్కృతి సంప్రదాయాల గురించి విద్యార్థులకు వివరించారు. – సాక్షి నెట్‌వర్క్


టేకులపల్లి: బొమ్మనపల్లి ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు భోగి పళ్లు పోస్తున్న ఉపాధ్యాయులు


పాల్వంచ: శ్రీవిద్యా స్కూల్‌లో...


జూలూరుపాడు: పడమటనర్సాపురంలో..


టేకులపల్లి: బొమ్మనపల్లి ప్రాథమిక పాఠశాలలో


ఇల్లెందురూరల్: కొమరారం పాఠశాలలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు


ఇల్లెందు: మాంటిస్సోరీ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు